క్లుప్తంగా

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం



కంకిపాడు: రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు పూర్తి స్థాయిలో పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ వీ భావనారాయణ అన్నారు. మండలంలోని కందలంపాడు గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ భావనారాయణ సదస్సు ఉద్దేశాన్ని వివరించారు. గ్రామస్తులు లేవనెత్తిన భూ సమస్యలను స్థానికంగా వివరించి, అర్జీలను స్వీకరించారు. సమావేశంలో పలువురు వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు గాయాలు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధి విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. దీనిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. తాడిగడప ఎన్టీఆర్ కాలనీకి చెందిన వల్లభనేని అన్నపూర్ణ పోరంకి యూనియన్ బ్యాంక్ సమీపంలో ఉంటున్న మిత్రురాలు అడుసుమిల్లి హిమలక్ష్మి ఇంటికి వెళ్లింది. ఇద్దరూ కలిసి బందరు రోడ్డు దాటుతుండగా తాడిగడప జంక్షన్ వైపు నుంచి పోరంకి వైపునకు వెళుతున్న బైక్ వారిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలు అవడంతో స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రేషన్ కార్డు విభజన చేయండి

కంకిపాడు: మండలంలోని కోలవెన్ను గ్రామానికి చెందిన ఓ కుటుంబం రేషన్‌కార్డు విభజన కోసం అర్జీ దాఖలు చేసింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో 'మీ కోసం' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భావనారాయణ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ రెవెన్యూ సేవలను సమర్థంగా పొందాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీ కోసంతో సమస్యల పరిష్కారం త్వరితగతిన జరుగుతుందని తహసీల్దార్ అన్నారు. సమావేశంలో పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ధనుర్మాస పూజలు ప్రారంభం



గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ధనుర్మాస పూజలు సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. త్రిదండి రామానుజ చినజీయర్‌స్వామి మంగళశాసనాలతో ఉపాలయంలోని శ్రీగోదాదేవి సమేత శ్రీకృష్ణస్వామి వారికి విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, విశేష అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఎస్.రామాచార్యులు నేతృత్వంలో సుమారు 500 మంది భక్తులకు ధనుర్మాస వ్రత దీక్షాకంకణ ధారణ జరిపారు. నగర సంకీర్తన చేసిన అనంతరం తిరుప్పావై ప్రబంధ పారాయణం, భగవన్నామ సంకీర్తన చేశారు. ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా ఆలయాన్ని, స్వామివార్ల ఉత్సవమూర్తులకు వివిధ రకాల పుష్పాలు, పండ్లతో చేసిన అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ధనుర్మాస గోష్ఠి సభ్యులు, వికాస తరంగిణి సభ్యులు, పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీ ట్యూషన్ ఫీజు గడువు పెంపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, డిగ్రీ, పీజీ ట్యూషన్ ఫీజు గడువు ఈ నెల 28వ తేదీ వరకు పొడిగించినట్లు వర్సిటీ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.అజంతకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల ప్రాంగణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంతీయ అధ్యయన కేంద్రంలో డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం, పీజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఈనెల 28వ తేదీలోపు ఏపీ ఆన్‌లైన్ ద్వారా ట్యూషన్ ఫీజు చెల్లించాలన్నారు. యూజీసీ మార్గదర్శకాల ప్రకారం ప్రతి విద్యార్థి ఏబీసీ ఐడి క్రియేట్ చేసుకోవాలని సూచించారు. ఐడీ ద్వారా యూనివర్సిటీ నుంచి ప్రతి సమాచారం విద్యార్థులకు లభిస్తుందన్నారు. తప్పనిసరిగా ఏబీసీ ఐడీ రిజిస్టర్‌చేసుకోవాలని సూచించారు. వివరాలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంతీయ అధ్యయన కేంద్రంలో, 0866-2434868 ఫోన్ నంబర్‌లో కానీ సంప్రదించాల్సిందిగా కోరారు.

హక్కులపై అవగాహన

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం కన్జ్యూమర్ క్లబ్ ఆధ్వర్యాన వినియోగదారుల అవగాహన వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి విద్యార్థి దశ నుంచే వినియోగదా సూచించారు. కన్జ్యూమర్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.నవీన మాట్లాడుతూ వినియోగదారు అవగాహన వారోత్సవాల్లో విద్యార్థులకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుధాకరరావు, రామకృష్ణ, అప్పారావు, కిషోర్ పాల్గొన్నారు.

మల్లవల్లి భూమిపై మడత పేచీ!

- జీవో నంబర్ 456కు తిలోదకాలు
- ప్రత్యామ్నాయ భూకేటాయింపు చేస్తామంటూ కొత్త పాట
- నివాస యోగ్యం కాని, నిరుపయోగ భూమి కట్టబెట్టేందుకు యత్నం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం మల్లవల్లిలో పేదల ఇళ్ల స్థలాలు, సామాజిక అవసరాలకు కేటాయించిన భూమిపై కూటమి ప్రభుత్వం మాట తప్పింది. మల్లవల్లి పారిశ్రామిక వాడ భూసేకరణ తరుణంలో గ్రామస్తులకు ఇచ్చిన హామీ బుట్టదాఖలు చేస్తోంది.

విషయం ఇదీ..

జీవో నంబర్ 456 ప్రకారం మల్లవల్లి రీ సర్వే నంబర్ 11లోని 1,460 ఎకరాల్లో 1,360 ఎకరాలను ఏపీఐఐసీ పారిశ్రామికవాడకు, మిగిలిన 100 ఎకరాల భూమిని నిరుపేదల ఇళ్లస్థలాలు, సామాజిక అవసరాల నిమిత్తం కేటాయిస్తున్నట్లుగా స్పష్టంగా పేర్కొనప్పటికీ మళ్లీ పేచీ పెడుతున్నారు. గ్రామానికి ఇస్తామన్న భూమి ఇది కాదు, అది మరెక్కడో ఉందంటూ కొత్త పాట అందుకున్నారు. గ్రామానికి దూరంగా, నిరుపయోగంగా ఉన్న భూమిని గ్రామస్తులకు మొక్కుబడి తంతుగా అంటగట్టి ఈ భూమి లాక్కునేందుకు యత్నిస్తున్నారు.

అప్పుడు స్పష్టంగా చెప్పి..ఇప్పుడు తూచ్..

గతంలోనే మల్లవల్లిలో సామాజిక అవసరాలకు కేటాయించిన 100 ఎకరాల భూమి ఇదేనంటూ రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులు స్పష్టంగా సూచించినప్పటికీ, దానిపై ఇప్పుడు తూచ్ అంటున్నారు. గ్రామ సామాజిక అవసరాలు, ఇళ్ల స్థలాలకు 100 ఎకరాలు ఇస్తామని చెప్పిన మాట వాస్తవమే కానీ ఆ భూమి ఇక్కడ కాదంటూ రెవెన్యూ అధికారులు కొత్త పాట అందుకున్నారు. కాగా, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ భూమిలో మల్లవల్లి జెడ్పీ హైస్కూల్ నిర్మాణానికి 5 ఎకరాలు, రెండు వేల మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు 13 ఎకరాల్లో లే అవుట్ సిద్ధం చేశారు. తాజాగా కూటమి ప్రభుత్వ నిర్ణయంతో వాటి భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది.

రెవెన్యూ అధికారుల నోట.. ప్రభుత్వ పెద్దల పాట

పారిశ్రామిక అవసరాల కోసం ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో గుట్టుచప్పుడు కాకుండా ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులు ఈ భూమిని స్వాధీనం చేసుకునేందుకు చర్యలు చేపట్టారు. కానీ గ్రామస్తులు ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగాన్ని క్షేత్రస్థాయిలో అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ తెరచాటు మంత్రాంగం నడుస్తోంది. గతంలో చంద్రబాబు ప్రభుత్వం జారీ చేసిన జీవోను ఆయనే అపహాస్యం చేస్తూ, ఆ భూములు స్వాధీనం చేసుకోవటంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఇళ్ల స్థలాల పంపిణీకి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వేసిన జగనన్న హౌసింగ్ లే అవుట్ (ఫైల్)

లోయను తలపించే ప్రాంతంలో..

గతంలో సామాజిక అవసరాలకు కేటాయించిన 100 ఎకరాల భూమికి బదులుగా మరోచోట భూకేటాయింపు చేస్తామంటూ ఇటీవల రెవెన్యూ అధికారులు గ్రామస్తులను నమ్మించారు. దీని కోసం ప్రత్యామ్నాయ భూమిని కూడా చూపిస్తామని గుడివాడ ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఏపీఐఐసీ జెడ్‌ఎం బాబ్జి నేతృత్వంలో గ్రామస్తులను తీసుకువెళ్లారు. పూర్తిగా నివాసానికి నిరుపయోగంగా, గ్రామానికి దూరంగా ఉన్న భూమిని సూచించారు. గ్రామానికి దాదాపు ఆరు కిలోమీటర్లు దూరంగా ఉన్న ఈ భూమి పూర్తిగా లోయను తలపిస్తూ దాదాపు 10 అడుగుల లోతులో ఉండటంతో గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ భూమిపై నుంచి హైటెన్షన్ విద్యుత్ లైను వెళ్లుతుండటం, గ్రామం నుంచి నేరుగా సరైన రోడ్డు లేకపోవటంతో గ్రామస్తులు ససేమిరా అంటున్నారు. ప్రస్తుత భూమి గ్రామంలోని బీసీ కాలనీకి అనుకుని ఉండటంతో ఈ భూమిని వదులుకునే ప్రసక్తి లేదని తెల్చిచెప్పారు.

పవన్‌కల్యాణ్ తీరుపై..

గతంలో మల్లవల్లి పారిశ్రామికవాడకు విచ్చేసిన జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఇక్కడి నిర్వాసితుల పక్షాన నిలబడతానని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం మారుతుందని, న్యాయం జరుగుతుందని చెప్పి నమ్మించారు. కానీ ఇప్పుడు నిర్వాసితులకు పరిహారం చెల్లింపు ఊసే లేకపోగా, గతంలో గ్రామానికి కేటాయించిన 100 ఎకరాల భూమి లాక్కోవటంపై కనీసం నోరు మెదపటం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

భూములు లాక్కోవడం తగదు



గ్రామ అవసరాల నిమిత్తం కేటాయించిన వంద ఎకరాల భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని, పరిశ్రమలకు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచించడం దారుణం. ఎట్టి పరిస్థితుల్లోనూ సహించం. ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులను అడ్డుకుని తీరుతాం. గతంలో హామీ ఇచ్చినట్లుగా గ్రామస్తులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి.

– తోట సాంబశివరావు, మల్లవల్లి

అసంపూర్తిగా సచివాలయ భవన నిర్మాణం

– పట్టించుకోని కూటమి ప్రభుత్వం



ఉంగుటూరు: గత ప్రభుత్వం ప్రారంభించిన అభివృద్ధి పనులను ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. భవనాల నిర్మాణాలు చివరి దశకు వచ్చినప్పటికీ వాటిని పూర్తి చేయాలనే ఆలోచన చేయటంలేదన్నట్టు పరిస్థితులు కనిపిస్తున్నాయి.

గత ప్రభుత్వంలో రూ.40 లక్షలు మంజూరు

మండలంలోని పెద్ద అవుటపల్లిలో గ్రామ సచివాలయం నూతన భవన నిర్మాణ పనులు పరిశీలిస్తే ఈ పరిస్థితి స్పష్టమవుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు నేడు నిధులు రూ.40 లక్షల మంజూరు చేసింది. దీంతో ఏళ్ల తరబడి కమ్యూనిటీ హాల్ భవనంలో కొనసాగుతున్న గ్రామ పరిపాలన సొంత భవనం చేకూరుతుందని భావించారు. భవన నిర్మాణ పనులు కూడా వేగవంతంగా ముందుకు సాగాయి. దాదాపుగా రూ.30 లక్షల పనులు పూర్తి చేసీ తుదిదశకు చేరింది.

భవన నిర్మాణం పూర్తి చేయాలని వినతి..

కూటమి ప్రభుత్వం వచ్చిన నాడు- నేడు పనులు నిలిపివేసింది. ఫలితంగా గ్రామ పరిపాలన కమ్యూనిటీ హాలులోనే కొనసాగుతోంది. ముగింపు దశకు చేరిన సచివాలయ భవనాన్ని పూర్తి చేసి సొంత భవనంలో గ్రామ పరిపాలన కొనసాగించాలని పలువురు గ్రామ ప్రజలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో ఏక రుద్రాభిషేకాలు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఉదయం 5 గంటలకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించారు. ప్రదోష కాలములో స్వామివారికి అభిషేకం, అర్చన చేశారు. అనంతరం స్వామివారిని పల్లకీలో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ నిర్మాణ దాత సంగా నరసింహారావు, భక్తులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని శ్రీగంగా, పార్వతి సమేత కొండేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఆరుద్రనక్షత్రం సందర్భంగా పలురకాల అభిషేకాలు వైభవోపేతంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు తరలివచ్చారు. ఓంనమశ్శివాయ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఆలయాన్ని, కొండేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. పరమేశ్వరునికి ఏకాదశ రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, సువర్ణ జలాభిషేకాలను ఆలయ అర్చకులు కుందేటి మురళీ శర్మ నేతృత్వంలో కనులపండువగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో శాంతి కల్యాణం నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో కొండేశ్వరస్వామి

వాగు.. వెతలు



నున్నలో పొంగుతున్న వాగు (ఫైల్)


- వర్షాలొస్తే వాగుతో భయం భయం
- శిథిలమైన కల్వర్టు
- వంతెన నిర్మించాలని వినతి

విజయవాడరూరల్: నున్న గ్రామంలో వికాస్ కాలేజికి వెళ్లే రహదారిలో చినకంచి వద్ద చప్టాపై వంతెన నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. వర్షాలు కురిసినప్పుడు వాగులు పొంగి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. వర్షాలు కురుస్తున్నాయంటేనే గ్రామస్తులతో పాటు వికాస్ కాలేజికి వెళ్లే వందలాది మంది విద్యార్థులతో పాటు, జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న ప్రజానికం వ్యవసాయ పొలాలున్న రైతులు, కూలీలు ఇంకా చిన్న చిన్న సంస్థల్లో పని చేసే ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

గతంలో కొట్టుకుపోయిన అనేకమంది..

నున్న, కొత్తూరు తాడేపల్లి, చిన నందిగం, కోడూరు పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షం నీరు, నున్న అడవుల్లో కొండలపై కురిసే వర్షం నీరు కూడా వాగుల్లో ఉధృతంగా ప్రవహిస్తుంటాయి. అత్యంత వేగంతో ప్రవహించే వాగు దాటికి గతంలో అనేక మంది కొట్టుకు పోయిన సంఘటనలున్నాయి. అంతేకాక పశువులు కూడా కొట్టుకుని పోతున్నాయి. ఇలాంటి సంఘటనలు అనేకం జరగడం తో ప్రజలు ప్రాణభయంతో ఉంటున్నారు. వాగులు వస్తున్నాయంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేయాల్సిన భయంకర పరిస్థితి నుంచి తమకు రక్షణ కల్పించాలని గ్రామప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వంతెన ఎంతో అవసరం..



ఇక్కడ వంతెన నిర్మాణం ఎంతో అవసరం. జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న వందలాది కుటుంబాలకు ఎంతో ప్రయోజనం. నిత్యం రాకపోకలు సాగించే ప్రజలకు, రైతులకు విద్యార్థులకు అవసరాల దృష్ట్యా వంతెన నిర్మించాలి. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ మేరకు చర్యలు తీసుకోవాలి.

– డి.సుబ్రహ్మణ్యంరాజు, నున్న గ్రామం

వర్షాలు వస్తే వణికిపోతున్నాం..



వర్షాలు వచ్చిన సమయంలో వణికిపోతున్నాం. జగనన్న కాలనీలో ఉంటున్న తమకు గుండెల్లో రైళ్లు పరుగెత్తుతుంటాయి. కష్టపడి పనిచేసుకునే కుటుంబాల వారు విజయవాడ నుంచి ప్రతి రోజు కాలనీకి వస్తుంటాం. వాగులు వస్తే అటు, ఇటు రాకపోకలు స్తంభిస్తున్నాయి. వంతెన నిర్మించాలి.

– షేక్ హుస్సేన్, జగనన్న కాలనీ

శిథిలావస్థలో చప్టా..

వాగు పై శిథిలావస్థలో ఉన్న చప్టాపై వంతెన నిర్మించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్యపై దృష్టి పెట్టి శాశ్వత పరిష్కారంగా వంతెన నిర్మించాలని కోరుతున్నారు. గత అక్టోబర్ నెలలో సంభవించిన వానలు, వరదలకు వాగులు పొంగిపొర్లాయి. వీటిని పరిశీలించిన రెవెన్యూ, పోలీసులు, మండల పరిషత్ అధికారులు వంతెన నిర్మాణం కోసం ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని ప్రజలకు తెలియజేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా వంతెన నిర్మించాలంటున్నారు.

డీసీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

- నేడు ఎన్నికల నిర్వహణ
- కంకిపాడు (డీసీ- 23), తెన్నేరు (డీసీ-6)కి కంకిపాడు తహసీల్దార్ కార్యాలయంలో..
- వెంట్రప్రగడ (డీసీ- 7)కు వెంట్రప్రగడలో..



కంకిపాడు బందరు కాలువ

కంకిపాడు: డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనెల 14న సాగునీటి సంఘాల ఎన్నికలను పూర్తి చేసిన అధికారులు రెండో అంకమైన డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలపై దృష్టి పెట్టారు. నోటిఫికేషన్‌లో భాగంగా ఈనెల 17న డీసీల ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు పూర్తి చేశారు.

■ కంకిపాడులో రెండు, వెంట్రప్రగడలో ఒక డీసీకి.. ఇటీవల నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో కంకిపాడు మండలంలోని రెండు డిస్ట్రిబ్యూటరీ కమిటీల పరిధిలో 8 సాగునీటి సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. 96 ప్రాదేశిక నియోజకవర్గాలకు గానూ 90 ప్రాదేశిక నియోజకవర్గాలకు సభ్యుల ఎన్నిక నిర్వహించారు.

నేడు ఇక్కడే..

మంగళవారం కంకిపాడు తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో కంకిపాడు (డీసీ- 23), తెన్నేరు (డీసీ- 6)కు ఎన్నిక నిర్వహించనున్నారు. ఇందుకుగాను గ్రౌండ్ వాటర్ విభాగానికి చెందిన విజయవర్ధన్, పశుసంవర్ధకశాఖకు చెందిన నర్సింహులు ఎన్నికల అధికారులుగా వ్యవహరించనున్నారు. కంకిపాడు డీసీ- 23 కింద వణుకూరు (డబ్ల్యూయూఏ- 136), గొడవర్రు (137), పోరంకి (138), ఈడుపుగల్లు (139), కోలవెన్ను (140), కుందేరు (141), పెనమలూరు (142), పెద ఓగిరాల (143), ఉయ్యూరు (144), కపిలేశ్వరపురం (145), గురజాడ (146) సంఘాలు ఉన్నాయి. తెన్నేరు డీసీ- 6 కింద ఉప్పలూరు (29), వేల్పూరు (29-ఏ), తెన్నేరు (30), వేంపాడు (31), కొయ్యగూరపాడు (32) సంఘాలు ఉన్నాయి.

వెంట్రప్రగడ డీసీ- 7 పరిధిలో..

వెంట్రప్రగడ డీసీ- 7కు వెంట్రప్రగడ ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయంలో మంగళవారం ఎన్నిక నిర్వహించనున్నారు. ఈ డీసీ కింద కోలవెన్ను (33), మానికొండ (34), కుందేరు (35), ముదునూరు (36), కలవపాముల (37), వెంట్రప్రగడ (38), పెదపారుపూడి (39) సాగునీటి సంఘాలు ఉన్నాయి. ఆ సంఘాలకు చెందిన అధ్యక్షులు హాజరై డిస్ట్రిబ్యూటరీ కమిటీని ఎన్నుకుంటారు.

ఈ ఎన్నిక కూడా ఏకపక్షమే..?

డీసీ ఎన్నిక సైతం ఏకపక్షంగానే సాగే అవకాశం ఉంది. ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూడా చేతులెత్తే విధానంలో అధికారుల పర్యవేక్షణలో టీడీపీ నేతలు దగ్గరుండి మరీ ఎన్నికను పర్యవేక్షించారు. ముందస్తుగా చేసుకున్న ఒప్పందం మేరకు ఆయా ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యులు, అనంతరం సాగునీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షుడి ఎన్నికను మొక్కుబడిగా పూర్తి చేసేశారు. ఆయా సంఘాల అధ్యక్షులే డీసీ కమిటీని ఎన్నుకుంటారు. దీంతో కమిటీ ఎన్నిక ఏ మేరకు జరగనుందో అవగతమవుతోంది.

ఏర్పాట్లు పూర్తి..



డీసీ కమిటీల ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి చేశాం. కంకిపాడు తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో కంకిపాడు డీసీ- 23, తెన్నేరు డీసీ- 6కు ఎన్నిక జరగనుంది. చేతులెత్తే పద్ధతిలో ఎన్నిక జరుగుతుంది. ఎన్నికల అధికారులకు బాధ్యతలు అప్పగించాం.

–వీ భావనారాయణ, తహసీల్దార్, కంకిపాడు

ఔత్సాహిక చెస్ క్రీడాకారులను ప్రోత్సహించాలి

కస్టమ్స్ అడిషనల్ కమిషనర్ కాకర్ల ప్రశాంత్‌కుమార్

కేసరపల్లి(గన్నవరం): ఔత్సాహికులైన చదరంగం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అకాడమీల ఏర్పాటుకు ముందుకురావాలని కస్టమ్స్ శాఖ అడిషనల్ కమిషనర్ కాకర్ల ప్రశాంత్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని కేసరపల్లిలో సాయిశ్రీనివాస నగర్‌లో అంతర్జాతీయ చదరంగం క్రీడాకారిణి గోలి సంధ్య ఏర్పాటు చేసిన సంధ్య చెస్ క్లబ్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కాకర్ల మాట్లాడుతూ..రెండు వేల సంవత్సరాల చరిత్ర కలిగిన చెస్ క్రీడకు ప్రపంచ వ్యాప్తంగా విశేష ఆదరణ ఉందన్నారు. దేశంలో తమిళనాడు తర్వాత ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో చదరంగం పట్ల పిల్లలు, యువత ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. చెస్ వల్ల పిల్లల్లో మేధాశక్తి పెరుగుతుందన్నారు. ఈ చెస్ క్లబ్‌ను ఆసక్తి కలిగిన పిల్లలు సద్వినియోగం చేసుకుని అంతర్జాతీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. గ్రామీణ స్థాయిలో ఆడపిల్లల కోసం ప్రత్యేకంగా చెస్ అకాడమీని ఏర్పాటు చేసిన సంధ్యను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. హిమజా కన్‌స్ట్రక్షన్ ఎండీ. చలసాని నాగసురేష్, గ్రామ సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక, విష్ణుశ్రీ హోటల్స్ సీఎండీ నల్లా పవన్‌కుమార్, చెస్ క్రీడాకారులు నిహారిక, అక్రమ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



చెస్ అకాడమీని ప్రారంభిస్తున్న ప్రశాంత్‌కుమార్, సర్పంచి

నేటి నుంచి 'ఆధార్' క్యాంపులు

కంకిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఈనెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ ఆధార్ నమోదుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.అనూష తెలిపారు. సోమవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. కంకిపాడు జెడ్పీ, పునాదిపాడు జెడ్పీ పాఠశాలల్లో ఆధార్ నమోదు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నారన్నారు. శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్ నమోదులు, సవరణలు చేసుకోవాలని కోరారు.



దుర్గమ్మకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఏలూరు జిల్లా కైకలూరుకు చెందిన శ్యామల నాట్య కళా అకాడమికి చెందిన కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శనతో నృత్య నీరాజనాలర్పించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై గురువులు కె.లక్ష్మీజ్యోతి పర్యవేక్షణలో 13మంది శిష్యబృందం పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్యప్రదర్శన ద్వారా నీరాజనాలర్పించారు. అనంతరం శిష్యబృందను ఆలయ ఈవో కెఎస్.రామరావు అభినందించి అమ్మవారి ప్రసాదాలు, దేవస్థాన ప్రశంసాపత్రాలను అందజేశారు. ఆలయ మర్యాదలతో శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించారు.

పంటకోత ప్రయోగం.. తగ్గిన దిగుబడి



ఉంగుటూరు: మండలంలోని తరిగొప్పల కండ్రిక గ్రామంలో పంట కోత ప్రయోగం సోమవారం నిర్వహించారు. పంట కోత ప్రయోగం తనిఖీ అధికారిగా గుడివాడ డివిజన్ డీవైఎస్‌ఓ ఎం.ఆనందకుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏఈవో దుర్గానాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వరి పంటలో నిర్దేశించిన అన్ని గ్రామాల్లో పంట కోత ప్రయోగాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పంట కోత ప్రయోగం దిగుబడికి అనుగుణంగా పంటల బీమా అందజేస్తారని పేర్కొన్నారు. వరద ముంపు కారణంగా తరిగొప్పల కండ్రికలో ఎకరానికి 12 బస్తాల దిగుబడి వచ్చిందని, మిగిలిన గ్రామాల్లో 35 నుంచి 40 బస్తాల దిగుబడి వచ్చిందని ఏఈవో వివరించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు సుందరయ్య, వి.దుర్గాప్రసాద్, బీమా కంపెనీ ఏజెంటు వరుణ్, రైతులు పాల్గొన్నారు.